798) బౌళి

ప|| నామోము చూచిచూచి నడుమ నేలకొంకేవు | ఆముకొని మెచ్చగానే నడ్డమాడేనా ||

చ|| బత్తిగలవాడవు పడతి పాటవింటివి | చిత్తము రంజించి నీకు చెవిబట్టెనా |
యిత్తలమే చెమరించె నెంతగరగెనో మతి | పొత్తుల వాకుచ్చి యాకె బొగడగరాదా ||

చ|| సరినిడుకొంటివి చదివించితి వాపెను | తిరమైన యాయర్థము తెలిసితివా |
నిరతి బులకలెల్లా నిండెను సంతోసమెంతో | అరుదై నపుడుగర లట్టె ఇయ్యరాదా ||

చ|| శ్రీవేంకటేశుడవు చెలియాట చూచితివి | భావించి నీకు గన్నుల పండుగాయనా |
యీవల నన్నేలితివి ఇదెంత జాణతనమో |సేవసేసే మిద్దరము సేసచల్ల రాదా ||